సాక్షి విశాఖపట్నం

గురువారం । 1 । జూన్ । 2023



సేవా 'శౌర్యా'నికి సాహో

నౌకాదళ అధికారులు, సిబ్బంది ధైర్య సాహసాలకు గుర్తింపుగా అత్యుత్తమ సేవా పతకాలతో ఇండియన్ నేవీ సత్కరించింది. 8లో



సమైక్యతా చిహ్నం హిందీ

జాతీయ సమైక్యత, భావాన్ని పెంపొందించేందుకు హిందీ ఎంతో తోడ్పడుతుందని డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి అన్నారు. 8లో



విశాఖ చేరుకున్న ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకట శేషసాయిని కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీసు కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ, డీసీపీ విద్యాసాగర్‌నాయుడు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మార్కెట్, రిజిస్ట్రేషన్ విలువలు..
వ్యత్యాసం కుదింపు

- మూడేళ్లుగా జరగని భూ విలువ సవరణ
- తాజాగా అభివృద్ధి, అత్యధిక లావాదేవీలు జరిగే ప్రాంతాల్లోనే పెంపు
- నేటి నుంచి అమల్లోకి సవరణ విలువలు

ద్వారకానగర్ ప్రాంతంలో మార్కెట్ విలువ ప్రకారం గజం రూ.2 లక్షల వరకు ఉంది. కానీ రిజిస్టర్ విలువ మాత్రం అత్యధికంగా రూ.62 వేలు మాత్రమే ఉంది.

గాజువాక ప్రధాన ప్రాంతాల్లో నివాసిత భూమి మార్కెట్ విలువ రూ.1.50 లక్షలు వరకు ఉంది. కానీ రిజిస్టర్ విలువ అత్యధికంగా రూ.22 వేలు మాత్రమే ఉంది.

గోపాలపట్నంలో మార్కెట్ విలువ రూ.లక్ష వరకు ఉంది. కానీ రిజిస్టర్ విలువ అత్యధికంగా రూ.35 వేలు మాత్రమే ఉంది.

ఇలా విశాఖలో అన్ని ప్రాంతాల్లో ప్రాంతాల్లోను మార్కెట్ విలువకు, రిజిస్టర్ విలువకు భారీ వ్యత్యాసం ఉంది.



మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

దొండపర్తి: కోవిడ్ కారణంగా గత మూడేళ్లుగా స్థిరాస్తి విలువల సవరణ పూర్తిస్థాయిలో జరగలేదు. తాజాగా భూ మార్కెట్, రిజిస్టర్ విలువల మధ్య ఉన్న భారీ వ్యత్యాసాలను స్వల్పంగా తగ్గిస్తూ స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయం తీసుకుంది. భూముల మార్కెట్ విలువలపై చేసిన సవరణలకు జేసీ విశ్వనాథ్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ బుధవారం ఆమోద ముద్ర వేసింది. అది కూడా సొంత ఇల్లు, స్థలం కలను సాకారం చేసుకోవాలనుకొనే ప్రజలను దృష్టిలో పెట్టుకొని ధరల పెంపుపై నిర్ణయం తీసుకుంది. కేవలం అభివృద్ధి చెందిన, చెందుతున్న ప్రాంతాల్లోను, జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న, ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ఏర్పాటవుతున్న, అత్యధికంగా స్థిరాస్తి లావాదేవీలు జరుగుతున్న ప్రాంతాల్లో మాత్రమే భూముల మార్కెట్ విలువను పెంచింది. ఆయా ప్రాంతాల్లో కూడా కేవలం 20 శాతం నుంచి 25 శాతం వరకు మాత్రమే స్థిరాస్తి విలువను పెంచుతూ సవరణలు చేసింది.

మార్కెట్ విలువ ఆధారంగా..

విశాఖ అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. తాజాగా అనేక ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లు, బహుళజాతి సంస్థలు విశాఖలో అడుగుపెట్టబోతున్నాయి. ప్రశాంత నగరంగా పేరుపొందిన విశాఖలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలని ప్రతి ఒక్కరూ పరితపిస్తుంటారు. దీంతో విశాఖలో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. నగర శివారు ప్రాంతాల్లో సైతం రూ.30 వేలు నుంచి రూ.50 వేలు గజం ధర పలుకుతోంది. కానీ రిజిస్టర్ విలువ మాత్రం అందుకు 70 శాతం కంటే తక్కువగానే ఉంది. ఇంకా నగర ప్రధాన ప్రాంతాల్లో 500 శాతం వరకు మార్కెట్, రిజిస్టర్ విలువల మధ్య వ్యత్యాసముంది. సాధారణంగా నగరాల్లో ఏడాదికి ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకోసారి భూముల మార్కెట్ విలువను సవరిస్తుంది. అయితే కోవిడ్ కారణంగా గత మూడేళ్లుగా పూర్తిస్థాయిలో స్థిరాస్తి విలువ సవరణలు జరగలేదు. దీంతో మార్కెట్, రిజిస్టర్ విలువల మధ్య భారీగా వ్యత్యాసాలు నెలకొన్నాయి. దీంతో మార్కెట్ విలువ ఆధారంగా రిజిస్టర్ విలువ కూడా పెంచాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నిర్ణయించారు. అది కూడా ప్రజలపై భారం పడకుండా మార్కెట్ విలువ ఆధారంగా తీసుకొని కేవలం 20 నుంచి 25 శాతం మేర మాత్రమే భూముల విలువ సవరణ చేయాలని ఆదేశించింది. దాని ప్రకారం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ భూముల విలువపై సమగ్ర కసరత్తు చేసింది. నగరంలో అత్యధిక లావాదేవీలు జరుగుతున్న ప్రాంతాలను అధికారులు గుర్తించారు. ప్రధానంగా మధురవాడ, ఆనందపురం, భీమిలి, లంకెలపాలెం ప్రాంతాలతో పాటు అభివృద్ధి చెందిన, భారీ ప్రాజెక్టులు వచ్చే ప్రాంతాలపై మార్కెట్ విలువలపై దృష్టి సారించారు.

రెసిడెన్షియల్ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న అత్యల్పం నుంచి అత్యధిక ధర.. అలాగే సవరణ తరువాత అత్యల్పం నుంచి అత్యధిక ధరలు

ప్రాంతం	ప్రస్తుత ధర	సవరణ ధర
ఆనందపురం	3,800 నుంచి 12,600	5000 నుంచి 15,000
భీమిలి	1400 నుంచి 10,000	2,000 నుంచి 12,000
ద్వారకానగర్	4,400 నుంచి 62,000	48,000 నుంచి 67,000
గాజువాక	10,000 నుంచి 22,000	12,000 నుంచి 25,000
గోపాలపట్నం	15,000 నుంచి 35,000	20,000 నుంచి 40,000
మధురవాడ	6,300 నుంచి 40,000	11,000 నుంచి 60,000
పెదగంట్యాడ	5500 నుంచి 24,000	8,000 నుంచి 28,000
పెందుర్తి	3,500 నుంచి 16,000	4,000 నుంచి 20,000
విశాఖ ఆర్‌ఓ	25,000 నుంచి 73,000	27,000 నుంచి 75,000

కమర్షియల్

ప్రాంతం	ప్రస్తుత ధర	సవరణ ధర
భీమిలి	12,000 నుంచి 16,000	13,000 నుంచి 17,000
ద్వారకానగర్	51,000 నుంచి 1,00,000	55,000 నుంచి 1,05,000
గాజువాక	24,000 నుంచి 32,500	26,000 నుంచి 35,000
గోపాలపట్నం	35,000	45,000
మధురవాడ	45,000	55,000
పెదగంట్యాడ	32,500	37,500
పెందుర్తి	10,000 నుంచి 26,500	11,500 నుంచి 35,000
విశాఖ ఆర్‌ఓ	52,500 నుంచి 86,000	57,000 నుంచి 93,000

ఫ్లాట్లతో ఫ్లాట్ల ధరల సవరణ

ఫ్లాట్ల ధరలతో పాటు ఫ్లాట్ల ధరల సవరణ కూడా పూర్తి చేశారు. ప్రధానంగా జోరుగా నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో చదరపు అడుగు ధరను స్వల్పంగా పెంచారు. పెందుర్తి, అగనంపూడి, ఎండాడ, మధురవాడ, కొమ్మాది వంటి ప్రాంతాల్లో భారీగా బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇక్కడ కూడా 20 నుంచి 25 శాతం మేర మాత్రమే చదరపు అడుగు ధరను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వ్యవసాయ భూముల విషయంలో కూడా ఇదే రీతిన సవరణలు చేశారు.

న్యూస్‌రీల్

47 వాహనాలపై కేసుల నమోదు



వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: పొల్యూషన్ సర్టిఫికెట్ లేని వాహనాలపై రవాణా శాఖ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. బీచ్‌రోడ్డు, హనుమంతవాక ప్రాంతాల్లో బుధవారం తనిఖీలు చేపట్టి.. 47 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఆర్టీవో ఐ.వేణుగోపాలరావు, ఎంవీఐ కె.ప్రవీణ్‌కుమార్, ఏఎంవీఐ మాధవి ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిటెక్నిక్ కౌన్సెలింగ్



పాలిటెక్నిక్ కాలేజీలో సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్న అధికారులు

మురళీనగర్: పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. బుధవారం 606 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో 27,001–35,000 ర్యాంకుల వరకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 319 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకున్నారు. పాలిటెక్నిక్ కాలేజీలో 35,001–43,000 ర్యాంకులకు నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 287 మంది విద్యార్థులు హాజరయ్యారు. కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ, పాలిటెక్నిక్ కాలేజీలో మెటలర్జీ విభాగం హెడ్ డాక్టర్ రత్నకుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆప్షన్ల ఎంపిక వాయిదా

పాలిసెట్ అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా గురువారం నుంచి ప్రారంభం కావాల్సిన ఆప్షన్ ఎంట్రీ/ఎక్సర్‌సైజింగ్ ఆప్షన్‌లు వాయిదా వేశారు. సవరించిన షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న చందనం అరగదీత



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మూడో విడత చందనం అరగదీత రెండో రోజు బుధవారం కొనసాగింది. ఈనెల 4వ తేదీ జ్యేష్ట పౌర్ణమిని పురస్కరించుకుని స్వామికి సమర్పించనున్న మూడు మణుగుల పచ్చిచందనాన్ని సమకూర్చేందుకు గత మంగళవారం నుంచి చందనం అరగదీత ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలి రోజు మంగళవారం 34 కిలోల చందనం అరగదీయగా, రెండో రోజు బుధవారం 35 కిలోల చందనాన్ని అరగదీశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చందనం అరగదీత కార్యక్రమం జరిగింది.

ఏడీసీపీగా నాగేంద్రుడు బాధ్యతల స్వీకరణ



సీపీ త్రివిక్రమ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగేంద్రుడు

దొండపర్తి : నగర స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీగా ఇ.నాగేంద్రుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. 1985 బ్యాచ్‌కు చెందిన నాగేంద్రుడు అనంతపురం జిల్లా ఏడీసీపీ(అడ్మిన్)గా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో విశాఖ ఏడీసీపీ(ఎస్‌బీ) వచ్చారు. పోలీస్ శాఖలో పలు ప్రాంతాల్లో కీలక విభాగాల్లో బాధ్యతలు నిర్వర్తించిన అనుభవంతో విశాఖ స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి యోగా తరగతులు

ఆరిలోవ: ఆంధ్రా యూనివర్సిటీలో యోగా విభాగంలో కొత్త బ్యాచ్ గురువారం ప్రారంభం కానుందని ఏయూ యోగా విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్‌బాబు ప్రకటనలో తెలిపారు. జనరల్ యోగా తరగతులతో పాటు యోగా థెరపీ తరగతులు రోజూ ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు జరుగుతాయన్నారు. ఆసక్తి గల వారు 9494401919, 8374351324 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

- 5,981 మంది విద్యార్థుల హాజరు
- జిల్లాలో 24 కేంద్రాలు ఏర్పాటు



విశాఖ విద్య: 10వ తరగతి సప్లిమెంటరీ(అడ్వాన్స్) పరీక్షలకు జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో 5,981 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా.. వీరి కోసం 24 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్ అవకాశం లేకుండా ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలనే కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా అన్ని కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించారు. తాగునీటి సౌకర్యాన్ని కల్పించేలా నగర పాలక సంస్థ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. పారామెడికల్ సిబ్బందితో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

విధుల్లో 300 మంది సిబ్బంది

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా 24 కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టమెంట్ అధికారులతో పాటు 300 మందిని ఇన్విజిలేషన్ కోసం వినియోగిస్తున్నారు. ప్రతీ కేంద్రంలో అదనంగా ఇన్విజిలేషన్ కోసమని నలుగురు సిబ్బందిని కేటాయించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే కేంద్రాలు ఏర్పాటు చేసినందున అక్కడి ఉపాధ్యాయులను సైతం వినియోగించుకునేలా.. ప్రతీ కేంద్రంలో ఐదుగురు అందుబాటులో ఉంచాలని హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీల కోసం మూడు స్క్వాడ్ బృందాలను నియమించారు.

ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

వార్షిక పరీక్షల మాదిరే సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు కూడా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారు. హాల్ టికెట్‌ను చూపించి కేంద్రాలకు బస్సుల్లో వెళ్లవచ్చు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. అదే విధంగా పోలీసు సిబ్బందిని బందోబస్తుకు నియమించారు.

నేడు ఇన్విజిలేషన్ సిబ్బందితో సమీక్ష

పరీక్షల విధులు కేటాయించిన ఇన్విజిలేషన్ సిబ్బందితో గురువారం జిల్లాలోని అన్ని కేంద్రాల్లో ముందస్తు సమీక్ష నిర్వహించాలి. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారుల ఈ విషయంలో బాధ్యత తీసుకోవాలి. స్టోరేజీ పాయింట్లకు పరీక్షల సామగ్రిని ఇప్పటికే చేర్చాం. ఏ రోజుకారోజు స్టోరేజీ పాయింట్లు నుంచి సామగ్రి తీసుకోవాలి.

– ఎస్.మురళీమోహన్,
ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్, జిల్లా

ధూమపానం ఆరోగ్యానికి హానికరం



మొక్క పంపిణీ చేస్తున్న ఆస్పత్రి యాజమాన్య ప్రతినిధి



జుంబా డ్యాన్స్ చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

బీచ్‌రోడ్డు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో ఆర్.కె.బీచ్‌లో స్టార్ట్ ప్లాంటింగ్ అండ్ స్టాప్ స్మోకింగ్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎం.రామారావు, పీఎఫ్ రీజినల్ కమిషనర్ విజయ్ భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి ఆరోగ్యం కోసం శారీరక దృఢత్వం చాలా కీలకమన్నారు. ఇందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ సీఈవో డాక్టర్ ఆదిత్య మాట్లాడుతూ ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించేందుకు, ధూమపానాన్ని వ్యతిరేకించే వాతావరణాన్ని సృష్టించేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నగర ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. జుంబా డ్యాన్స్ ప్రదర్శించి అవగాహన కల్పించారు.

ఆకాశవాణి కేంద్రంలో సీబీసీ కార్యాలయం

బీచ్‌రోడ్డు: సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) విశాఖపట్నం బ్రాంచ్ తన కార్యకలాపాలను ఇక నుంచి సిరిపురంలోని ఆకాశవాణి కేంద్రంలో నిర్వహించనుంది. ఈ మేరకు ఆకాశవాణి కేంద్రం రెండో అంతస్తులో కార్యాలయాన్ని ప్రారంభించినట్లు సీబీసీ సహాయ సంచాలకుడు షఫీ మహమ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. సీబీసీకు సొంత భవనం కేటాయించిన కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులకు, ఆకాశవాణి విశాఖపట్నం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సుబ్బారావుకు ధన్యవాదాలు చెప్పారు.

రైతుబజార్లలో మౌలిక సదుపాయాలు

- జూన్ చివర్లో ఆరిలోవ రైతుబజార్ ప్రారంభిస్తాం
- ముఖ్య కార్యనిర్వాహణాధికారి నందకిశోర్‌రెడ్డి వెల్లడి



రైతుల గుర్తింపు కార్డులు పరిశీలిస్తున్న రైతు బజార్ల సీఈవో నందకిశోర్‌రెడ్డి

సీతమ్మధార: నగరంలోని అన్ని రైతుబజార్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రైతుబజార్ల ముఖ్య కార్యనిర్వాహణాధికారి నందకిశోర్ రెడ్డి తెలిపారు. సీతమ్మధార రైతుబజార్‌ను బుధవారం ఆయన సందర్శించి.. రైతుల గుర్తింపు కార్డులు, ధరల పట్టికలు, మరుగుదొడ్లను పరిశీలించారు. రైతులకు ఎన్ని స్టాళ్లను కేటాయించారు, వారి సమస్యలపై ఆరా తీశారు. డ్రా విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. బజార్‌లో నిల్వ ఉన్న మురుగునీటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్గానిక్ షాపును సందర్శించారు. బోర్డులపై ధరలను రైతులు రాయడం గుర్తించి.. ఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నందకిశోర్ రెడ్డి మాట్లాడుతూ నగరంలోని 14 రైతుబజార్లలో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తామని చెప్పారు. ఈ క్రాఫ్ ద్వారా రైతుబజార్లను ప్రక్షాళన చేస్తామని స్పష్టం చేశారు. జూన్ చివరి వారంలో ఆరిలోవ రైతుబజార్‌ను ప్రారంభిస్తామని వెల్లడించారు. రైతుబజార్‌లో ఎటువంటి సంఘటనలు జరిగినా ఎస్టేట్ అధికారిపై చర్యలుంటాయన్నారు. జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసీన్, డీఈ కెనడీ, ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

నేడే వైఎస్సార్ రైతు భరోసా

- 27,955 మంది రైతులకు పెట్టుబడి సాయం విడుదల
- ఒక్కొక్కరికి రూ.7,500 చొప్పున రూ.20.96 కోట్లు కేటాయింపు

మహారాణిపేట: రైతులకు శుభవార్త. వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ పథకం ద్వారా గురువారం ఒక్కొక్క రైతు ఖాతాలో రూ.7,500 జమ చేయనున్నారు. వరుసగా ఐదో సంవత్సరం మొదటి విడతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా పత్తికొండలో జరిగే కార్యక్రమం ద్వారా రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. పద్మనాభం మండలం పాండ్రంకిలో జిల్లా స్థాయి కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లాలో 27,955 మంది రైతులను ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. వీరికి రూ.20,96,62,500 నిధులు మంజూరైనట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి అప్పలస్వామి తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొంటారని చెప్పారు.

పీఎంఎస్‌వీఏ నిధి వేడుకలకు ఆసియా బేగం



ఆసియా బేగం

డాబాగార్డెన్స్: ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మ నిర్భర్ నిధి వేడుకలకు జీవీఎంసీ నుంచి చిరు వ్యాపారి షేక్ ఆసియా బేగంను పంపినట్లు యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ పాపునాయుడు తెలిపారు. పీఎంఎస్‌వీఏ నిధి పథకం ప్రారంభించి మూడేళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఢిల్లీలో ఈ నెల ఒకటో తేదీ నుంచి మూడు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తున్నారు. తన జీవనోపాధి మెరుగుపడిన విధానంపై ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడనున్నారు.

మహిళా హాస్టళ్ల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి

- హాస్టళ్లలో చేరే వారి పూర్తి వివరాలతో రిజిస్టర్ నిర్వహించాలి
- పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ



మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: నగరంలోని మహిళా హాస్టల్స్ చుట్టూ ఉండే ప్రాంతాలు నాలుగువైపులా కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ హాస్టల్స్ నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం పోలీస్ సమావేశ మందిరంలో నగరంలో లేడీస్ హాస్టల్స్(వర్కింగ్ ఉమెన్స్, స్టూడెంట్స్) నిర్వహిస్తున్న నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్స్‌లో చేరడానికి వచ్చిన వారి పూర్తి వివరాలు తీసుకోవాలన్నారు. ఆ వివరాలకు సంబంధించిన రికార్డులు భద్రపరచాలని, విజిటర్స్ రిజిస్టర్, ఫ్యామిలీ లేదా గార్డియన్స్ రిజిస్టర్, వారు బయటకి వెళ్తున్న సమయం, తిరిగి వచ్చిన సమయాన్ని నమోదు చేసే రిజిస్టర్స్ నిర్వహించాలని చెప్పారు. ప్రతి హాస్టల్‌లో రిక్రియేషన్ రూమ్, విజిటర్స్ రూమ్ ఉండాలన్నారు. ఒకటి కంటే ఎక్కువ అంతస్తుల్లో ఉండే హాస్టల్స్ భవనాలలో సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి హాస్టల్ ప్రవేశ ద్వారం వద్ద నోటీస్ బోర్డ్ ఏర్పాటు చేసి అందులో కచ్చితంగా వారికి దగ్గరలో ఉండే పోలీస్ స్టేషన్, హాస్పటల్‌కు సంబంధించిన ఫోన్ నంబర్స్ ఉంచాలనీ, అదేవిధంగా హాస్టల్ యాజమాన్యం ఫోన్ నంబర్స్ కూడా తెలియజేయాలని చెప్పారు. హాస్టల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ దిశ యాప్‌పైన అవగాహనతో పాటు, వారి మొబైల్‌లో యాప్ కలిగి ఉండేలా బ్యానర్స్‌ను ప్రదర్శించాలన్నారు. ప్రతి హాస్టల్‌లో సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేసుకోవాలని, సాధ్యమైనంత వరకు మహిళలను సెక్యూరిటీ గార్డుగా పెట్టాలని, ఒకవేళ మగవారిని సెక్యూరిటీ గార్డ్‌గా నియమిస్తే లోకల్ పోలీస్ స్టేషన్ నుంచి క్యారెక్టర్ సర్టిఫికెట్ పొందిన వారిని మాత్రమే నియమించుకోవాలని తెలిపారు. అదే విధంగా ప్రతి మహిళా పోలీసు తమ పరిధిలో ఉన్నటువంటి హాస్టల్స్‌కు ప్రతి 15 రోజులకు ఒకసారి వెళ్లి అక్కడ ఉన్నటువంటి స్టూడెంట్స్ లేదా వర్కింగ్ ఉమెన్స్ సమస్యలను అడిగి తెలుసుకోవాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్ పరిధిలో ఉండే హాస్టల్స్ వద్ద నైట్ బీట్ బుక్ ఏర్పాటు చేసి ప్రతి రోజు రాత్రి హాస్టల్స్ విజిట్ చేయాలని చెప్పారు. అదే విధంగా హాస్టల్స్ యాజమాన్యంతో పలు అంశాలపై చర్చించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో డీసీపీ–2 కె.ఆనంద్ రెడ్డి, డీసీపీ(క్రైమ్) జి.నాగన్న, దిశ ఏసీపీ సి.హెచ్.వివేకానంద, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.శ్యామల, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి టి.ఎల్.ప్రసన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం

- రవాణాదారులపై పీడీ యాక్ట్ అమలు చేయాలి
- కాలేజీలు, హాస్టళ్లు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించాలి
- కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

దొండపర్తి(విశాఖ దక్షిణ): మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించాలని, రవాణాదారులపై పీడీ యాక్ట్ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పోలీస్, సెబ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాఫిక్ సబ్‌స్టాన్సస్(ఎన్‌డీపీఎస్) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మత్తుపదార్థాల వినియోగం, ఇందుకు గల కారణాలను విశ్లేషించారు. గంజాయి రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాలేజీలు, హాస్టల్స్, హోటల్స్‌లో అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, విద్యార్థులు మత్తు పదార్థాల వాడకాన్ని పూర్తిగా కట్టడి చేయాలని ఆదేశించారు. ఇందుకు పోలీస్, పోర్ట్, కోస్ట్ గార్డ్, మెడికల్, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

అన్ని కాలేజీల యాజమాన్యాలు ఎప్పటికప్పుడు తమ కాలేజీ ఆవరణలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులను మత్తు పదార్థాలకు దూరంగా ఉండే విధంగా కౌన్సెలింగ్ చేయాలన్నారు. డ్రగ్స్ ప్రభావం వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. తల్లిదండ్రులు యుక్త వయసులో ఉన్న తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల అలవాటు మానుకోలేని వారిని డి–అడిక్షన్ సెంటర్లకు పంపి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. మత్తు పదార్థాలకు సంబంధించి ఎటువంటి సమాచారమైనా టోల్ ఫ్రీ నెంబర్ 14500 తెలియజేయాలన్నారు.

రవాణాదారులపై పీడీ యాక్ట్

గంజాయి, డ్రగ్స్ రవాణా చేసేవారిని జోన్ల వారీగా విభజించి, వారందరిని కౌన్సెలింగ్ సెంటర్లకు పిలిచి కౌన్సెలింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అప్పటికీ మారకపోతే పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్ వినియోగాన్ని తక్షణమే గుర్తించేందుకు అవసరమైన సామాగ్రిని కొనుగోలు చేయాలని అధికారులకు చెప్పారు. గంజాయి, డ్రగ్స్ కేసుల్లో ష్యూరిటీలు సమర్పించే వారి వివరాలు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. డీసీపీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా జీవీఎంసీ, ఆటో యూనియన్స్‌తో సమావేశాలు నిర్వహించామన్నారు. ఆర్టీసీ బస్సుల ద్వారా ఒడిశా నుంచి విశాఖకు అధికంగా గంజాయి రవాణా జరుగుతున్నట్లు వివరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల బారిన పడిన యువకులు సత్ ప్రవర్తన మార్గంలో నడుచుకోవడానికి ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఈబీ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 191 కేసుల్లో 7547.7 కిలోల గంజాయి, 27.4 కిలోల హాషీష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. 2023, జనవరి 1వ తేదీ నుంచి ఈ నెల 30వ తేదీ వరకు 474 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 183 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, 60 కేసులు ఛార్జ్‌షీట్లు వేసినట్లు వివరించారు. సింథటిక్ డ్రగ్ కేసుల్లో నగరంలో 85 మంది డ్రగ్ ఎండ్ యూజర్లను గుర్తించామన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, ఎస్ఈబీ ఏఈఎస్ బి.శ్రీనాథుడు, పోలీస్, పోర్ట్, కోస్ట్ గార్డ్, మెడికల్, ఫారెస్ట్, కస్టమ్స్, కేజీహెచ్, డ్రగ్స్ కంట్రోల్, సీఐఎస్ఎఫ్, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచకపోతే పోరాటం ఉధృతం



ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు కార్మికులకు వేతనాలు పెంచకపోతే పోరాటం ఉధృతం చేస్తామని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ నుంచి పోర్టు వంతెన వరకు గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు కలిసి బుధవారం కార్మిక గర్జన ర్యాలీ నిర్వహించాయి. కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని, డీఏను బేసిక్‌లో మెర్జ్ చేసి కొత్త బేసిక్‌ను ప్రకటించాలని, అక్రమంగా విధులు నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ర్యాలీలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, కార్పొరేటర్లు దల్లి గోవిందరెడ్డి, గంధం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు ఉద్యోగులకు మెరుగైన ఇంక్రిమెంట్

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు ఉద్యోగులకు 14 సంవత్సరాల్లో మొదటిసారిగా గతంలో కంటే మెరుగ్గా 100 శాతం వార్షిక ఇంక్రిమెంట్లు అందజేసినట్లు ఏజీపీఎల్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. అదానీ గంగవరం పోర్ట్ లిమిటెడ్ తన వాటాదారుల సంక్షేమం, భద్రత వృద్ధికి విలువనిస్తోందని పేర్కొన్నారు. మొదటి బ్యాచ్‌కు చెందిన 63 మంది ఉద్యోగులకు కోసం శిక్షణ, వివిధ ఉద్యోగాలకు రిఫిట్ మెంట్‌తో సహా ఓ అప్‌స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

సేవా 'శౌర్యా'నికి సాహో

- ఘనంగా నేవల్ ఇన్వెస్టిచర్ వేడుకలు
- ఇద్దరు నౌకాదళాధికారులకు శౌర్య పతకాలు
- వేడుకగా పతకాల ప్రదానం
- నేవల్ డాక్‌యార్డుకు బెస్ట్ గ్రీన్ ప్రాక్టీస్-2023 అవార్డు

2021.. సెప్టెంబర్ 26.. ఉదయం 8 గంటలు..

జమ్మూకాశ్మీర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న 14 రాష్ట్రీయ రైఫిల్ బెటాలియన్ సెక్టార్-3లోని ఒక ఇంట్లో ఉగ్రవాదులున్నట్లు గుర్తించారు. వెంటనే మార్కోస్ బృందానికి సమాచారం అందించారు. వినీత్‌కుమార్‌తో సహా మార్కోస్ బృందం ఉగ్రవాదులున్న ఇంటి వద్దకు చేరుకుంది. ఖాన్ మొహల్లా, వాత్రినా అనే ఇద్దరు ఉగ్రవాదులున్న ఇంటికి ఎదురుగా ఉన్న ఇల్లుని మార్కోస్ బృందం ఆక్రమించింది. ఉగ్రవాదులు నేరుగా కాల్పులు జరిపేందుకు వీలుగా ఉన్న ఇంటి పైకప్పుపైకి ప్రమాదం అని తెలిసినా.. టెర్రరిస్టుల్ని మట్టుపెట్టడమే లక్ష్యంగా వినీత్‌కుమార్, మనీష్ చౌహాన్ పైకి వెళ్లారు. 9.30 గంటల సమయంలో టెర్రరిస్టులు గ్రానైడ్లతో దాడి చేయడంతో పాటు ఏకకాలంలో ఫైరింగ్ చేశారు. ఈ క్రమంలో రైఫిల్ మ్యాన్ మనీష్ చౌహాన్‌కు గాయాలయ్యాయి. గ్రానైడ్ పేలుడుతో వచ్చిన అగ్ని కీలల నుంచి తప్పించుకున్న వినీత్‌కుమార్.. ఉగ్రవాదుల్ని ట్రాక్ చేస్తూ.. వారున్న ఇంటిపైకి దూసుకెళ్లారు. ఫైరింగ్ తర్వాత రెండు గంటల పాటు మౌనంగా ఉన్న టెర్రరిస్టులు మరోసారి దాడికి ప్రయత్నించారు. ఈలోపునే.. వారిని ట్రాక్ చేసుకున్న వినీత్‌కుమార్.. ప్రాణాలకు తెగించి.. ఉగ్రవాదులపై కాల్పులు జరిపి మట్టుబెట్టారు. ఉగ్రమూకల నుంచి దేశాన్ని రక్షించేందుకు ధైర్య సాహసాల్ని ప్రదర్శించిన వినీత్‌కుమార్‌కు అత్యుత్తమమైన శౌర్య పతకం(గ్యాలంట్రీ మెడల్) వరించింది.



నేవీ చీఫ్ నుంచి గ్యాలంట్రీ మెడల్ అందుకుంటున్న వినీత్‌కుమార్

2020 నవంబర్ 26..

గోవా సాగరజలాల్లో ఐఎన్ఎస్ విక్రమాదిత్య నుంచి.. రయ్‌మంటూ గాల్లోకి మిగ్-29కి చెందిన మిగ్ 677 యుద్ధ విమానం దూసుకెళ్లింది. కొత్తగా నౌకాదళంలో చేరిన వారికి యుద్ధ విమానాలు నడిపే అంశంపై శిక్షణలో భాగంగా.. మిగ్ 677 విమానాన్ని అత్యంత అనుభవజ్ఞుడైన కమాండర్ నిశాంత్ సింగ్ నడుపుతూ కోపైలట్‌కు శిక్షణ అందిస్తున్నారు. 1500 గంటలకు పైగా.. మిగ్ విమానాల్ని నడిపిన అనుభవం ఉన్న నిశాంత్.. శిక్షణ అందిస్తున్న సమయంలో సాయంత్రం 4.27 గంటల సమయంలో మిగ్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. ఒక్కసారిగా తలెత్తిన ఈ హఠాత్పరిణామం నుంచి తప్పించుకునేందుకు నిశాంత్ తన శాయశక్తులా ప్రయత్నించారు. 15 వేల అడుగుల ఎత్తు నుంచి అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ.. కిందకి వస్తూ ఉన్నారు. దాదాపు 502 అడుగుల ఎత్తులో పరిస్థితులు చేజారిపోయినట్లు గుర్తించారు. వెంటనే ట్రైనీ పైలట్ ను విమానం నుంచి తప్పించేసిన నిశాంత్.. తన ప్రాణాల్ని మాత్రం కాపాడుకోలేక దేశం కోసం తుదిశ్వాస విడిచారు. అందుకే నిశాంత్‌కు శౌర్య పతకం వరించింది.



గ్యాలంట్రీ మెడల్ అందుకుంటున్న నిశాంత్ సింగ్ సతీమణి

ఇలా ఒక్కొక్కరిదీ.. ఒక్కో విజయగాథ..

శత్రుదేశాల నుంచి దేశాన్ని రక్షిస్తూ.. పౌరులు జీవితాలు ప్రశాంతంగా సాగేందుకు శ్రమిస్తున్న నౌకాదళ అధికారులు, సిబ్బంది ధైర్య సాహసాలకు గుర్తింపుగా అత్యుత్తమ సేవా పతకాలతో ఇండియన్ నేవీ సత్కరించింది. 33 మందికి శౌర్య, నవ్‌సేనా, విశిష్ట సేవా, కెప్టెన్ రవిధీర్ మెమొరియల్, లెఫ్టినెంట వీకే జైన్ మెమోరియల్ గోల్డ్ మెడల్స్, జీవన్ రక్షా పదక్ అవార్డులను భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ చేతుల మీదుగా ప్రదానం చేశారు.

తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రమైన విశాఖలో నేవల్ ఇన్వెస్టిచర్ సెరమనీ-2023ని బుధవారం ఘనంగా నిర్వహించారు. నౌకాదళాధికారులు, సెయిలర్స్, యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్ల సారధులు, నేవీ కుటుంబాల సమక్షంలో పతకాల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ హితంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ నౌకల నిర్వహణ సాగిస్తున్న విశాఖలోని నేవల్ డాక్‌యార్డు... బెస్ట్ గ్రీన్ ప్రాక్టీస్-2023 ఇండస్ట్రియల్ విభాగంలో సీఎన్ఎస్ ట్రోఫీని దక్కించుకుంది.

– సాక్షి, విశాఖపట్నం

విశాఖ ప్రజలారా.. మిలాన్-2024కు సన్నద్ధమవుదాం..



ఇండియన్ నేవీలో తూర్పు నౌకాదళం కీలకంగా వ్యవహరిస్తోందని భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ అన్నారు. విశాఖ నగరంలో ఇప్పటికే ఐఎఫ్ఆర్, పీఎఫ్ఆర్‌తో పాటు, వివిధ దేశాలతో ద్వైపాక్షిక, బహుళ విన్యాసాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. 2022లో విశాఖలో నిర్వహించిన మిలాన్‌తో ప్రపంచ దేశాలకు భారత రక్షణదళ సత్తాని చాటామన్నారు. ఇప్పుడు మరోసారి రికార్డు స్థాయిలో జరగనున్న మిలాన్‌కు విశాఖ ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధమవుతోందని తెలిపారు. మిలాన్-2024 పేరుతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 15న దాదాపు 50 దేశాలతో ఈ విన్యాసాల్ని ఈస్టర్న్ నేవల్ కమాండ్ ప్రధాన స్థావరంలో నిర్వహించనున్నామని.. నగర ప్రజలు సహకారంతో ఈ కార్యక్రమం కూడా విజయవంతంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. వివిధ దేశాల మధ్య సహృద్భావ వాతావరణంలో స్నేహ పూర్వక సత్సంబంధాల్ని మెరుగు పరచుకోవడంతో పాటు శత్రుసైన్యానికి బలం, బలగం గురించి నిత్యం తెలియజేసేందుకు ఈ విన్యాసాలు నిర్వహించనున్నట్లు అడ్మిరల్ హరికుమార్ తెలిపారు.

డోలి మోతలు లేకుండా ఏజెన్సీలో రోడ్ల నిర్మాణం



స్థాయి సంఘం సమావేశంలో మాట్లాడుతున్న చైరపర్సన్ సుభద్ర, చిత్రంలో సీఈవో శ్రీరామ్మూర్తి



సమావేశానికి హాజరైన సభ్యులు,వివిధ శాఖల అధికారులు

- ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టాలి
- స్థాయీ సంఘం సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఏజెన్సీ ప్రాంతంలో డోలి మోతలు ఉన్న గ్రామాలకు వెళ్లి రహదారుల కోసం సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఆదేశించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన పలు స్థాయీ సంఘాల సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ డోలి మోతలు లేకుండా అన్ని గ్రామాలకు ఉపాధి హామీ పథకం కింద రహదారులు నిర్మించాలన్నారు. ఈ మేరకు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి తీర్మానాలు చేపట్టాలన్నారు. ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేసి, పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అల్లూరి జిల్లాకు 13,005 ఇళ్లు మంజూరయ్యాయని గృహ నిర్మాణ సంస్థ జిల్లా మేనేజర్ చెప్పగా.. త్వరితగతిన పూర్తి చేయాలని చైర్‌పర్సన్ కోరారు. ఇంకా అర్హులు ఉంటే ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. దోమల వల్ల వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. తాను నివాసం ఉంటున్న డాక్టర్స్ కాలనీలో కూడా దోమలు బెడద ఉందని జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి అన్నారు. దీనిపై స్పందించిన మలేరియా అధికారి మణి దోమల నివారణకు తీసుకుంటున్న పలు చర్యలను వివరించారు.

కేజీహెచ్‌లో రక్త నిల్వలు లేవా?

కేజీహెచ్‌లో గిరిజన రోగులు రక్తం కోసం సంప్రదిస్తే.. డోనర్‌ను తీసుకురావాలని చెబుతున్నారని, మన్యంలో ఉండే గిరిజనులను తీసుకురావడం సాధ్యమేనా అని సుభద్ర ప్రశ్నించారు. దీనిపై కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ వేసవి కారణంగా రక్తం నిల్వలు తక్కువగా ఉన్నాయని, అత్యవసర కేసులకు మాత్రమే రక్తం సరఫరా చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి తెలిపారు. చిన్నగుమ్ములూరులో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రాంతంలో కూలీల సౌకర్యార్థం టెంట్, మంచినీరు, పరికరాలు లేవని రాయవరం జెడ్పీటీసీ సభ్యుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం డబ్బులు కూడా ప్రతి వారం విడుదల చేయడం లేదని అనంతగిరి జెడ్పీటీసీ సభ్యుడు తెలిపారు. 15 రోజులకు ఒకసారి డబ్బులు వేస్తున్నట్టు జిల్లా ఉపాధి హామీ పథకం అధికారి తెలిపారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలని చైర్‌పర్సన్ సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లాడ్జీలో తనిఖీలు

- పోలీసులు అదుపులో ఆరుగురు
- ఒకరి వద్ద ఫిస్టల్ స్వాధీనం

సీతమ్మధార: మహారాష్ట్రకు చెందిన ఆరుగురిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా రైల్వే న్యూకాలనీలోని ఓ లాడ్జీలో దిగారు. ఎస్ఐ వెంకటరావు మంగళవారం రాత్రి లాడ్జీలో సాధారణ తనిఖీలు చేపట్టారు. ఇందులో నలుగురు ఒడిశాలోని పూరి జగన్నాథస్వామిని దర్శించుకోవడానికి వెళ్తున్నట్లు చెప్పారు. మరో ఇద్దరు కూడా అక్కడికే వెళ్తున్నామని చెప్పినప్పటికీ.. అనుమానం వచ్చి బ్యాగులు తనిఖీ చేపట్టారు. ఒకరి బ్యాగులో ఫిస్టల్ ఉన్నట్లు గుర్తించి విచారణ చేపట్టారు. ఒడిశాలో ఒకరు ఫిస్టల్‌ను ఆర్డర్ చేసినట్లు వారు పోలీసులకు తెలిపారు. ఆర్డర్ కాపీపై ఆరా తీయగా.. వారి వద్ద లేకపోవడంతో ఆరుగురిని స్టేషన్‌కు తరలించారు. అక్కడ డీసీపీ(క్రైం) నాగన్న వీరిని విచారించారు. ఫిస్టల్ ఎక్కడ కొనుగోలు చేశారన్న వివరాల సేకరణకు ఓ బృందం మహారాష్ట్ర వెళ్లింది.

దేశానికి ప్రధాన సేవకుడు మోదీ

- ప్రపంచ దేశాలకు ఆదర్శంగా భారత్
- బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యారావు



మాట్లాడుతున్న సత్యారావు

బీచ్‌రోడ్డు : దేశానికి ప్రధానమంత్రిలా కాకుండా ప్రధాన సేవకుడులా నరేంద్రమోదీ పనిచేస్తున్నారని బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యారావు అన్నారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో భారతదేశం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. అన్ని రంగాల అభివృద్ధిలో భారతదేశం దూసుకుపోతుందన్నారు. కరోనా సమయంలో ఇతర దేశాలు ఆర్థికంగా ఇబ్బందులకు గురైతే భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం పటిష్టంగా ఉందన్నారు. దేశంలో వైద్యం, విద్య, వ్యవసాయం కోసం లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారు. రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగడం లేదని, జరిగితే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పనులపై తాను చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ప్రస్తుతం జనసేనతో తమకు పొత్తు ఉందని, ఎన్నికలకు రెండు నెలల ముందు పూర్తి స్థాయి పొత్తు ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో విశాఖ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లలో కేంద్రం చేసిన అభివృద్ధి ఏంటి?

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అల్లిపురం: తొమ్మిదేళ్లలో బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండి సాధించిన అభివృద్ధి ఏంటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2014కి ముందు భారతదేశం అప్పు రూ.47 లక్షల కోట్లు ఉంటే, మోడీ తొమ్మిదేళ్ల పరిపాలనలో రూ.153 లక్షల కోట్లు ఉన్నాయన్నారు. డాలర్‌తో రూపాయి విలువ అప్పుడు రూ.59 ఉంటే ఈరోజు రూ.83కి పెరిగిందన్నారు. ధరలు తగ్గిస్తామని, ఏడాదికి 2 కోట్ల మందికి ఉద్యోగాలు ఇస్తామని, రైతుల ఆదాయం పెంచుతామని, గిట్టుబాటు ధరలు ఇప్పిస్తామని చెప్పి దగా చేశారన్నారు. బీజేపీ పాలనలో అంబానీలు, అదానీలు మాత్రమే లాభపడ్డారన్నారు. పార్లమెంట్ ప్రారంభోత్సవంలో అందరినీ పరిగణలోకి తీసుకోవాల్సింది పోయి కనీసం రాష్ట్రపతికి ఆహ్వానం కూడా ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. సాధువుల్లో ఒక్క సాధువుగా మారి మోదీ ప్రారంభోత్సవం చేశారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా చిహ్నం హిందీ



రైల్వే అధికారులకు జ్ఞాపిక అందజేస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: జాతీయ సమైక్యత, జాతీయ భావాన్ని పెంపొందించేందుకు హిందీ ఎంతో తోడ్పడుతుందని, హిందీ అభివృద్ధికి కృషి చేయాలని వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్, టీవోఎల్ఐసీ చైర్మన్ అనూప్‌కుమార్ సత్పతి అన్నారు. డీఆర్ఎం కార్యాలయంలో 76వ అధికారిక భాష అమలు కమిటీ సమావేశాలు బుధవారంతో ముగిశాయి. హిందీ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధాన సంస్థలకు ఈ సందర్భంగా డీఆర్ఎం జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థల జాబితాలో వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం మొదటి స్థానం, ఈస్టర్న్ నేవల్ కమాండ్ రెండో స్థానం, కస్టమ్స్ కమిషనరేట్ కార్యాలయం మూడో స్థానంలో నిలిచాయి. చిన్న సంస్థల జాబితాలో ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా, కేంద్రీయ విద్యాలయ, నౌసేనా భాగ్, కేంద్రీయ విద్యాలయం, ఐఎన్ఎస్ కళింగ మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. టీవోఎల్ఐసీ నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతులు, సర్టిఫికెట్లు డీఆర్ఎం అందజేశారు. టీవోఎల్ఐసీ రాజభాషాధికారి, అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ ఎ.వెంకటేశ్వరరావు, ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ ట్రాన్స్‌లేటర్ సుదీప్త భక్షి, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తులు

మురళీనగర్ : పాలిటెక్నిక్ కాలేజీల్లో లేటరల్ ఎంట్రీ ద్వారా నేరుగా ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు నోటిఫికేషన్ జారీ అయినట్లు పాలిటెక్నిక్ ప్రవేశాల రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ కె.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ వివిధ బ్రాంచిల్లో విద్యాభ్యాసం పూర్తి చేసిన వారు ఈ పరీక్షలో పాల్గొని నేరుగా పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో చేరవచ్చన్నారు. ఐటీఐ బ్రిడ్జికోర్సు ప్రాక్టికల్స్ పాసై ఉండాలని, కంపార్టుమెంటులో పాసైనవారు లేదా ఐటీఐ పరీక్షలు రాస్తున్నవారు, బ్రిడ్జి కోర్సు ప్రాక్టికల్ పరీక్షలకు బ్రిడ్జికోర్సు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నవారు కూడా అర్హత పరీక్ష రాయవచ్చన్నారు. పరీక్ష ఫీజు ఈనెల 6వ తేదీలోగా చెల్లించాలని, 13వ తేదీన పరీక్ష ఉంటుందని తెలిపారు. https://sbtet.ap.gov.in/APSBTET వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలన్నారు.

4వ తేదీ వరకు మొక్కజొన్న కొనుగోలు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లాలో ఈ నెల 4వ తేదీ వరకు మొక్కజొన్న కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు పద్మనాభం, భీమిలి మండలాల్లో వెలుగు, సహకార సంఘాల ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కనీస మద్దతు ధర క్వింటాకు రూ.1962తో ఇప్పటి వరకు 300 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను 40 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని పేర్కొన్నారు. ఈ మేరకు రూ.13 లక్షలు రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేశామన్నారు. మిగతా రైతులకు నగదు సిఫార్సు చేశామని చెప్పారు. మొక్కజొన్న రైతులు తమ పేర్లను రైతు భరోసా కేంద్రాల్లో ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 4వ తేదీ తర్వాత రైతు భరోసా కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోళ్లు జరగవని జేసీ స్పష్టం చేశారు.

కోట్టవలస కాదు: కోట్పర్ రోడ్‌లో మూడు రైళ్లకు హాల్ట్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): స్థానిక ప్రాంత ప్రజల డిమాండ్ మేరకు మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కోట్పర్ రోడ్‌లో అదనపు హాల్ట్ ఇచ్చేందుకు రైల్వే బోర్డు నిర్ణయించినట్టు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు.

- జగదల్‌పూర్-భువనేశ్వర్(18448) హీరాకండ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల ఒకటో తేదీ నుంచి కోట్పర్ రోడ్‌కు సాయంత్రం 5.03 గంటలకు చేరుకుని, 5.05 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో భువనేశ్వర్-జగదల్‌పూర్(18447) హీరాకండ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 2వ తేదీ నుంచి తెల్లవారుజామున 4.13 గంటలకు కోట్పర్ రోడ్ చేరుకుని, 4.15 గంటలకు బయల్దేరుతుంది.
- రూర్కెలా-జగదల్‌పూర్(18107) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 2వ తేదీ నుంచి ఉదయం 8.45 గంటలకు కోట్పర్ రోడ్డు చేరుకని, 8.47 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-రూర్కెలా(18108) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 2వ తేదీ నుంచి మధ్యాహ్నం 2.43 గంటలకు కోట్పర్ రోడ్ చేరుకుని, 2.45 గంటలకు పయనమవుతుంది.
- విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 2వ తేదీ నుంచి తెల్లవారు 4.13 గంటలకు కోట్పర్ రోడ్ చేరుకుని, 4.15గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 2వ తేదీ నుంచి రాత్రి 7 గంటలకు కోట్పర్ రోడ్ చేరుకుని, 7.02 గంటలకు బయల్దేరుతుంది.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు

సీతంపేట: అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో బుధవారం రాత్రి జరిగిన విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) కుమారుడి వివాహ వేడుకకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించారు. చంద్రబాబు రాకతో స్టేడియం వద్ద సందడి నెలకొంది. పార్టీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు.

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	510.00
విజయనగరం	514.00
శ్రీకాకుళం	514.00

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.152
స్కిన్	: రూ.274
స్కిన్‌లెస్	: రూ.284